TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

ఎడిటర్ : బిఎస్ శివ కుమార్ సంపుటి : 1 సంచిక : 23 గురువారం, ఆగస్టు 06, 2026 , పేజీలు - 4 వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR VOLUME : 1 ISSUE: 23 06-08-2026 (THURSDAY) PAGES: 4 RS : 5/-

### హైడ్రా కమిషనర్ రంగనాథ్

## సంతకం ఫోర్జరీ



**హైదరాబాద్:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీకి గురైంది. పలు ప్రైవేట్ ఇంటర్ కళాశాలలు అక్రమంగా ఫైర్ ఎన్వోసీలు పొందేందుకు ఆయన సంతకం ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. పలువురు ఉన్నాతాధికారుల ఫోర్జరీ సంతకాలతోనే 8 ప్రైవేట్ కాలేజీలు ఇంటర్‌బోర్డుకు ఫైర్ ఎన్వోసీలు సమర్పించినట్లు వెల్లడైంది. ఆయా కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్ బోర్డుకు అధికారులు మంగళవారం ఫిర్యాదు చేశారు. హైడ్రా అదనపు డైరెక్టర్‌ఫిర్యాదుతో లేక్ ఠాణాలో పోలీసులు కేసు నమోదు చేశారు. మరో 60 కాలేజీల ఎన్వోసీలను కూడా పరిశీలి స్తున్నట్లు అధికారులు తెలిపారు. ఫోర్జరీ ఎన్వోసీలు పొందిన కాలేజీలివే : హైదరా బాద్‌లో కీలక ప్రాంతాల్లోని పలు ప్రైవేట్ ఇంటర్ కాలేజీలు ఫైర్ ఎన్వోసీల కోసం ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. మెహిదీ పట్నంలో ప్రియాంక ఇంటర్మీడియట్ కాలేజీ, విద్యానగర్‌లోని మదర్స్ గర్ల్స్, చాంద్రాయణగుట్టలోని శ్రీచంద్ర, చిక్కడపల్లి లోని న్యూ ఎరా, శివరాంపల్లిలోని షాహీన్, తెల్లాపూర్‌లోని వశిష్ట, బర్కత్‌పురాలోని హైందవి, ఎస్ఆర్‌నగర్‌లోని రెజోనెన్స్ కాలేజీలు ఉన్నతాధికారుల ఫోర్జరీ సంతకాలతోనే నకిలీ ఎన్వోసీలను ఇంటర్ బోర్డుకు పంపించినట్లు అధికారులు గుర్తించారు.జీహెచ్ఎంసీ కమిషనర్ సంతకమూ ఫోర్జరీ : అగ్నిమాపక నిరభ్యంతర ధ్రువపత్రాల కోసం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు కీలక అధికారుల సంతకాలను కాలేజీ యాజమాన్యాలు ఫోర్జరీకి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. గతంలో అగ్నిమాపక శాఖలో పనిచేసి బదిలీ అయిన ఉన్నతాధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ సంతకాలు ఫోర్జరీ జరిగినట్టు గుర్తించారు. అయితే ఈ వ్యవహారంలో సూత్రదారులెవరు? పాత్రదారులెవరు? అనే కోణంలో పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు.ఓ కాలేజీ ఎన్వోసీపై అనుమానంతో : ప్రతి విద్యాసంవత్సరంలో ఆయా కళాశాలలు తప్పనిసరిగా హైడ్రాకు ఎన్ఓసీలను సమర్పించాల్సి ఉంటుంది.

### 'భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు పాక్

## దుష్ప్రచారం'



**జమ్మూకశ్మీర్:** జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదాను రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆగస్టు 5వ తేదీని దోపిడీ దినోత్సవంగా పాటించేందుకు పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది ముమ్మాటికి భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు పాక్ చేస్తున్న దుష్ప్రచారమేనని విదేశాంగ శాఖ పేర్కొంది. ఇలాంటి ప్రయత్నాలతో అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని పాక్? యత్నిస్తోందని మండిపడింది. అయితే, భారత్‌పై ఆరోపణలు చేయడం కంటే ముందుగా పీఓకేలో జరుగుతున్న రక్తపాతాన్ని ఆపాలని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్?ధీర్ జైస్వాల్ సూచించారు. అలాగే పాక్? భూభాగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఉగ్రవాద సంస్థలపై శాశ్వత చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా, అక్రమణలో ఉన్న భారత భూభాగాలన్నింటినీ తక్షణమే ఖాళీ చేయాలని వ్యాఖ్యానించారు.

### ఇకపై అత్యవసర సేవలకు '100' కాదు -

## '112' నొక్కాలి



**హైదరాబాద్, ఆగస్టు 5 :** తెలంగాణలో డయల్ 112 సేవలను రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడారు. డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు.ఒకే వ్యవస్థలోకి పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, ౧+×జజజ నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ ఆల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్డ్ టెక్నికల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు.టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తెస్తాం..యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక

### ఆర్టికల్ 370 రద్దు తర్వాత- జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రజల జీవితాల్లో చాలా మార్పులు వచ్చాయి



**న్యూ ఢిల్లీ :** 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత నుంచి జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ప్రజల జీవితాల్లో విస్తృతమైన మార్పులు వచ్చాయని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం అన్నారు. ఇరు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణతోపాటు విద్య, వైద్యం, వ్యాపార, క్రీడా రంగాల్లో అవకాశాలు ఎంతో మెరుగయ్యాయని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేసి ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జమ్మూకశ్మీర్?, లద్దాఖ్? ప్రాంతాల అభివృద్ధికి, అక్కడ ఉన్న ప్రతి పౌరుడికి పెద్ద కలలు కనే, వాటిని సాధించే, వికసిత్ భారత్? నిర్మాణంతో తమ వంతు సహకారం అందించే అవకాశం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారంటూ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు."ఏడేళ్ల క్రితం ఇదే రోజున, ఆర్టికల్ 370, ఆర్టికల్ 35 చరిత్రగా మారిపోయాయి. ఇది జమ్మూకశ్మీర్?, లద్దాఖ్ ప్రస్థానంలో ఒక నిర్ణయాత్మకమైన కొత్త అధ్యాయాన్ని లిఖించింది. అప్పటి నుంచి జమ్మూకశ్మీర్?, లద్దాఖ్ ప్రజల జీవితాల్లో విస్తృతమైన మార్పులు వచ్చాయి. మౌలిక సదుపాయాలు విస్తరించాయి. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాపార, క్రీడలు వంటి రంగాల్లో అవకాశాలు పెరిగాయి.

### తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు సమస్యను

## పరిష్కరించండి

- దిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్ర అటవీ పర్యావరణ శాఖల మంత్రి భూపేంద్ర యాదవ్‌ని కలిసిన సీఎం

**హైదరాబాద్ :** తెలంగాణలోని పలు సాగునీటి ప్రాజెక్టులు, రహదారులకు శాఖా పరమైన అనుమతులు పర్యావరణ అనుమతులు ఇతర అంశా లపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీలో కేంద్ర మంత్రు లను కలుస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు.ముంపు ఎక్కువగా ఉండదు : 148 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి గతంలోనే మహారాష్ట్ర అంగీకరించిన సీఎం కేంద్రమంత్రికి విషయాన్ని గుర్తుచేశారు. 150 మీటర్ల ఎత్తుతో డ్యాం నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని ఒకవేళ 150 మీటర్లకు ఎత్తు పెంచినా ముంపు ప్రాంతం కేవలం 1000 హెక్టార్ల లోపే ఉంటుందని సీఆర్ పాటిల్‌కు సీఎం వివరించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా ప్రాణహిత నది నీటిని గ్రావిటీతో సాగు, తాగుకు అందించే అవకాశం ఉంటుందని విజ్ఞప్తి చేశారు.పర్యావరణ అనుమతులు ఇవ్వండి : అంతకు ముందు గౌరవెల్లి, సీతారామ ఎత్తిపోతలు, డిండి, పాలమూరు-రంగారెడ్డి తదితర ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులపై కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్?ను కలిసి చర్చించారు. త్వరగా



అనుమతులు ఇవ్వాలని సీఎం కోరారు. ఈ చర్చల్లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పలువురు ఎంపీలు, సెక్రటరీ శ్రీధర్ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఏఐసీసీ అగ్రనేతల వద్దకు : అనంతరం సీఎం రేవంత్ ఏఐసీసీ అగ్రనేతలను కలిసే అవకాశాలున్నట్లు తెలిసింది. నియోజకవర్గాల పునర్విభజన, ఇతర అంశాలపై చర్చించే అవకాశం ఉంది.

### దేశాభివృద్ధిలో


## యువతదే కీలక పాత్ర



**అమరావతి:** విద్య అనేది కేవలం ఉద్యోగం పొందడానికి మాత్రమే కాకుండా, వ్యక్తిత్వ వికాసానికి, దేశ నిర్మాణానికి దోహదపడాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పేర్కొ న్నారు. అమరావతిలోని అమృత యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేష్‌తో పాటు వెంకయ్య నాయుడు కూడా పాల్గొన్నారు. పట్టభద్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు 'విదేశాల్లో చదువుకున్నా మనదేశానికి వచ్చి సేవ చేయండి. చదువు సంస్కారం నేర్పాలి. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయంలోపు మీ పనులు పూర్తి చేసుకొండి. తల్లిదండ్రులతో కలిసి సమయం గడపండి. కుటుంబ వ్యవస్థకు మూలం భారత్. ప్రపంచంలో భారత్ శక్తి వంతమైన దేశం. భారత్ విశ్వ గురువు. గతంలో ప్రపంచంలోని పలు దేశాల విద్యార్థులు మన దేశంలోని నలందా, తక్షశిల లాంటి యూనివర్సిటీల్లో చదువుకున్నారు' అని వెంకయ్య పేర్కొన్నారు 'నేను స్కూల్ నుంచే విద్యార్థి నాయకుడిగా పని చేశా. ఎమర్జెన్సీ టైమ్‌లో 17 నెలలు పాటు జైల్లో ఉన్నా. 1983 లో ఎమ్మెల్యేగా గెలిచా. రాజకీయాల్లో ఉండగా నా జేబు నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. నా నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో 30 ఏళ్లు ప్రతిపక్షంలోనే ఉన్నా. నేను ఒకప్పుడు వాజపేయి పేరు గోడ మీద రాశాను. అదే వాజపేయితో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఒకే వేదికపై కూర్చున్నా' వెంకయ్య గుర్తు చేసుకున్నారు

### 22ఏ భూముల పేరిట ఏ ఒక్క అర్హుడికీ

## అన్యాయం జరగనివ్వం



**హైదరాబాద్, ఆగస్టు 5:** తెలంగాణ రాష్ట్రంలో 22ఏ భూముల పేరిట ఏ ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదని, కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్?రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలని స్పష్టం చేశారు. 22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం చేశారు22ఏ నిషేధిత భూముల అంశంపై సమీక్ష : రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూములపై తరచూ వస్తున్న విమర్శలు, ఆరోపణలు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి పొంగులేటి శ్రీనివాస్?రెడ్డి సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులతోపాటు ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో సర్కారు పనిచేస్తోందని తెలిపారు.

### నీటి విషయంలో అన్యాయం జరిగితే

## తెలంగాణ ఊరుకోదు



**హైదరాబాద్, ఆగస్టు 5:** ఈనెల(ఆగస్టు) 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయో జనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు.

# వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాలి

**– అభ్యంతరకర పోస్టులపై బాధ్యత గ్రూప్ అడ్మిన్ లదే బాధ్యతా వహించాలి**

**– నార్లపూర్ పోలీస్ స్టేషన్ మేడారం ఎస్ఐ అచ్చ కమలాకర్**



**ఆదాబ్ సైబరాబాద్ ,ములుగు:**గ్రూప్ అడ్మిన్‌లకు కీలక సూచనలు అభ్యంతరకర పోస్టులు ఎవరైనా పెడితే వెంటనే అప్రమత్తమై తొలగించండివాట్సాప్ గ్రూపుల్లో చట్టవిరుద్ధ పోస్టులు వద్దు సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్త చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు ఎస్ఐ కమలాకర్ వాట్సాప్ గ్రూపుల్లో సభ్యులు చేసే ప్రతి పోస్టుపై గ్రూప్ అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అచ్చ కమలాకర్ సూచించారు. గ్రూపులో ఎవరైనా సభ్యులు అభ్యంతరకరమైన, అసభ్యకరమైన, విద్వేషపూరితమైన లేదా చట్టవిరుద్ధమైన పోస్టులు, సందేశాలు, ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని తెలిపారు. అటువంటి పోస్టులు చేసే సభ్యులను వెంటనే గ్రూపు నుంచి తొలగించాలని, అవసరమైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని గ్రూప్ అడ్మిన్‌లకు సూచించారు. సోషల్ మీడియా వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, చట్టాన్ని ఉల్లంఘించే పోస్టులు సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రజలు సోషల్ మీడియాలో సమాచారాన్ని షేర్ చేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని, పుకార్లు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, మత, కుల విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ అచ్చ కమలాకర్ సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలను ప్రోత్సహించే లేదా అభ్యంతరకర పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సోషల్ మీడియా ప్రజలకు ఉపయోగపడే వేదిక కావాలి అపోహలు, అసత్య ప్రచారం, అభ్యంతరకర పోస్టులకు కాదు అని ఎస్ఐ కమలాకర్ స్పష్టం చేశారు.

# తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ హక్కుల పోరాట సమితి

**– తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మహిపతి అరుణ్ కుమార్**

**– నిరుపేద గిరిజన దశలిపట్టు రైతులను ఆదుకోవాలని మనవి జేక శేఖర్**



**ఆదాబ్ సైబరాబాద్, ములుగు:**మంచిర్యాల జిల్లా సాంప్రదాయంగా తరతరాలుగా సుమారు 50 సంవత్సరముల నుండి భూములు లేని నిరుపేద గిరిజన దశలీపట్టు రైతులు తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల, కొమరం భీం ఆసిఫాబాద్, భూపాల్ పల్లి మరియు ములుగు జిల్లాలలో తెలంగాణ రాష్ట్ర సెరికల్చర్ డిపార్ట్మెంట్ యొక్క సాంకేతిక సహకారంతో సాగు చేస్తూ వారి యొక్క జీవనోపాధిని గడుపుతున్నారు, వారికి జీవన ఆధారమైనటువంటి అడవినే నమ్ముకుని అడవి పరిసర ప్రాంతాల్లో బ్రతుకుతూ అడవిలో పెరిగే మద్ది చెట్ల మీద దశలిపట్టు పురుగులను పెంచి వాటి ద్వారా వచ్చిన కాయలను అమ్ముకుంటూ వాటి ద్వారా వచ్చిన అరకొర డబ్బులతో వారి యొక్క కుటుంబాలను గడుపుతున్నారు,, ఇటువంటి నిరుపేదలకు సెరికల్చర్ డిపార్ట్మెంట్ దశాబ్దాల కాలం నుండి అనేక రకాలుగా సహాయపడుతూ వారిని అన్ని విధాలుగా ఆదుకుంటూ ఉన్నది,,, కానీ గత కొంతకాలం నుండి నిరుపేద గిరిజన రైతులు అడవి మీద ఆధారపడి పురుగులు పెంచుకొనుటకు అన్ని రకాల అనుమతులు ఉన్న, అట్టి విషయాన్ని ఫారెస్ట్ వర్కింగ్ ప్లాన్ లో పొందుపరిచిన కొంతమంది క్షేత్రస్థాయి ఫారెస్ట్ అధికారులు మరియు సిబ్బంది నిర్లాక్షణంగా పేద గిరిజన రైతులు మద్ది చెట్లపై పెంచే పురుగులను వాటి కోసం ఏర్పాటు చేసిన వసతులను కొల్లగొడుతూ దశాబ్దల కాలం నుండి దాన్నే నమ్ముకుని బతుకుతున్న నిరుపేద గిరిజన రైతులను హరిగోశ పెడుతూ, ఆర్థికంగా నష్టపరుస్తూ, పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు,, ఇట్టి విషయమై సంబంధిత డీఏఫోలు, రేంజ్ ఆఫీసర్లు మరియు ప్రజా ప్రతినిధులైనటువంటి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ , సిర్పూర్ టీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు బెల్లంపల్లి శాసన సభ్యులు గడ్డం వినోద్ మొదలగు వారిని అనేకసార్లు విన్నవించుకున్నను క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి ఫారెస్ట్ సిబ్బంది కనీస కనికరం లేకుండా అడవినే నమ్ముకుని బ్రతుకుతున్న అడవి బిడ్డలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తూ ఆర్థికంగా వారిని కృంగిపోయేలా చేస్తున్నారు,,, ఇట్టి విషయాన్ని ఈరోజు శ్రీ కొమరం భీమ్ వర్ధంతి సభ ఏర్పాటుచేసిన జోడేఘాట్ కెరమెరి నందు రాష్ట్ర మంత్రివర్యులు శ్రీమతి సీతక్క దృష్టికి శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు ద్వారా మంత్రివర్యులకు తెలియజేయడమైనది, దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రివర్యులు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ హెడ్ డోబ్రియల్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ తెలంగాణ రాష్ట్రంకి చెప్పి ఈ సమస్యకు పరిష్కారం చేస్తానని మాటిచ్చారు,, కావున దీనిని గమనించి మన సెరికల్చర్ డిపార్ట్మెంట్ వారు కూడా ఇట్టి విషయాన్ని డైరెక్టర్ ద్వారా మెంబర్ సెక్రటరీ మరియు ప్రిన్సిపల్ సెక్రెటరీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవింపజేసి నిరుపేద గిరిజన రైతులు తరతరాల నుండి దసలిపట్టు సాగునే నమ్ముకుని అడవి మద్ది చెట్లపై ఆధారపడి బ్రతుకుతున్న వారికి శాశ్వత పరిష్కారాన్ని చూపాలని వేడుకుంటున్నారు

# ఆరోగ్యమంతమైన బిడ్డకు పునాది తల్లిపాలే

**– జె.శ్రీనివాసులు హెల్త్ ఎడ్యుకేటర్**

**– సంధ్య అంగన్వాడి సూపర్వైజర్**




**ఆదాబ్ సైబరాబాద్ షాద్ నగర్ ఆగస్ట్ 05:** బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడు ఏరియా సబ్ సెంటర్ "ఎ " అర్బన్ 2వ అంగన్వాడి సెంటర్ లో ప్రపంచ తల్లిపాల వారోత్సవం లో భాగంగా అంగన్వాడి టీచర్ పద్మ ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవం యొక్క కార్యక్రమంలో, తల్లిపాల యొక్క ప్రాముఖ్యత గురించి హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు. ప్రతి సంవత్సరము ఆగస్టు 1 నుండి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహిస్తాము అని, ఈ వారవోత్సవం ముఖ్య ఉద్దేశము తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయడం జరుగుతుందని మరియు ప్రతి శిశువుకు తల్లిపాలు అందేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, మొదటి 6 నెలలు వరకు శిశువుకు తల్లిపాలు తప్పకుండా పట్టించాలి అని చెప్పారు. పాప పుట్టిన వెంటనే వచ్చే మురుపాలు శిశువుకు అమృతముతో సమానము అని, ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయని తెలియజేశారు. తల్లిపాలు తాగే పిల్లలకు విరేచనాలు, నిమోనియా వంటి ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం తక్కువ అని, శిశువు మెదడు ఎదుగుదలకు, శారీరక మరియు మానసిక అభివృద్ధికి తల్లిపాలు ఎంతో అవసరమని, తల్లి బిడ్డల మధ్య ప్రేమ అనుబంధం మరింత బలపడుతుందని, తల్లిపాలు ఎల్లప్పుడూ పరిశుభ్రమైనవి అని, ఈ పాలు సరైన ఉష్ణోగ్రతలో ఉంటాయని, వీటికి ఎలాంటి ఖర్చు ఉండదని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు. తల్లి పాపకు పాలు ఇవ్వడం వలన ప్రసవం తర్వాత గర్భాశయం సాధారణ స్థితికి రావడానికి సహాయపడుతుందని, ప్రసవానంతరశీ రక్తస్రావం తగ్గుతుందని, రొమ్ము క్యాన్సర్లు, అండాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుందని మరియు తల్లి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని తెలియజేశారు. మరియు శిశువు పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ప్రారంభించాలని, మొదటి ఆరు నెల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి అని, నీరు లేదా ఇతరహారము అవసరము లేదని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు చెప్పారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్య మాట్లాడుతూ గర్భవతులందరూ అంగన్వాడి సెంటర్ లో ఇచ్చే బాలామృతము, గుడ్లు మరియు మురుకులు తప్పకుండా తీసుకొని, తినాలని తెలియజేశారు. వీటివలన తల్లికి , బిడ్డకు కావలసిన పోషకాహారం అందుతుందని చెప్పారు. తల్లులు పాపకు పాలు ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా పట్టించి పాలు. తాగిన తర్వాత , పాపను భుజంపై వేసుకొని వీపు తట్టాలని తెలియజేశారు. గర్భవతిగా ఉన్నప్పుడు ఆరోగ్య సిబ్బంది ఇచ్చే ఐరన్ మాత్రలు రెగ్యులర్గా తీసుకోవాలని తెలియజేశారు. తదుపరి అక్కడికి వచ్చిన బాబుకు హెల్త్ ఎడ్యుకేటర్ జె .శ్రీనివాసులు బాల అమృతం తినిపించారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, అంగన్వాడి సూపర్వైజర్ సంధ్య, 19 వార్డ్ కౌన్సిలర్ ఆరిఫా బేగం, 20 వార్డు కౌన్సిలర్ పి.గోపాల్, అంగన్వాడి టీచర్స్ పద్మ, కవిత, రాధాదేవి , జయమ్మ , శ్రీదేవి, ఏ.ఎన్.ఎమ్. ఇస్తే రాణి, అంగన్వాడి ఆయా కళావతి, మరియు ఆశలు, గర్భవతులు మరియు బాలింత తల్లులు పాల్గొన్నారు.

# గర్భిణీలు బొప్పాయి పండ్లు, కోడిగుడ్లను తినకూడదా.. వైద్యులు ఏమంటున్నారు..?



గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే ఆహారం పిండం ఎదుగుదలపై నేరుగా ప్రభావం చూపుతుంది. అందుకే ఈ కాలంలో ఏ ఆహారాలు తీసుకోవాలి, ఏవి తీసుకోకూడదనే విషయంపై సరైన అవగాహన ఉండడం చాలా ముఖ్యం. పోషకాహారం లోపించినా, అవసరానికి మించి కొన్ని పదార్థాలు తీసుకున్నా తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా బొప్పాయి, గుడ్ల గురించి అనేక అపోహలు ఉండటంతో వాటి గురించి స్పష్టంగా తెలుసుకోవడం అవసరం. బొప్పాయి పోషకాలతో నిండిన పండు. ఇది రోగనిరోధక శక్తిని పెంచడం, జీర్ణక్రియను మెరుగుపరచడం, గాయాలు త్వరగా మానేందుకు సహాయపడడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా వైద్యుల సలహాతో బొప్పాయిని ఆహారంలో భాగంగా తీసుకుంటుంటారు.పచ్చి బొప్పాయిని తింటే..అయితే గర్భిణులు, అలాగే గర్భం దాల్చాలని ప్రయత్నిస్తున్న మహిళలు పచ్చి లేదా పూర్తిగా పండని బొప్పాయిని తీసుకోకూడదని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. దీనికి కారణం పచ్చి బొప్పాయిలో ఉండే పెపైనఅనే ఎంజైమ్. ఇది శరీరంలో ప్రసవాన్ని ప్రేరేపించే ప్రోస్టాగ్లాండిన్, ఆక్సిటోసిన్ హార్మోన్ల మాదిరిగా పనిచేసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఫలితంగా గర్భాశయంలో సంకోచాలు ఏర్పడి గర్భస్రావం జరిగే ప్రమాదం పెరుగుతుందని అంటున్నారు. కొన్ని పరిశోధనల ప్రకారం పచ్చి బొప్పాయిలో ఉండే ఎంజైములు, లేటెక్స్ వంటి పదార్థాలు గర్భాశయాన్ని ఉత్తేజపరచి నొప్పులు, సంకోచాలను కలిగించే అవకాశం ఉంటుంది. ఇవి గర్భం ప్రారంభ దశల్లో ఉన్న మహిళలకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే పూర్తిగా పండిన బొప్పాయిని గర్భిణులు పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు.పండిన బొప్పాయి అయితే..పండిన బొప్పాయిలో పచ్చి బొప్పాయిలో ఉండే లేటెక్స్, పెపైన్ ప్రభావం చాలా వరకు తగ్గిపోతుంది. కాబట్టి వైద్యుల సలహా మేరకు పరిమిత మోతాదులో తీసుకోవచ్చు. పచ్చి బొప్పాయిలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది మహిళల రుతుచక్రాన్ని ప్రభావితం చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. శరీరంలో హార్మోన్ల సమతుల్యతపై ప్రభావం చూపే అవకాశం ఉండడంతో గతంలో కొన్ని ఆసియా దేశాల్లో దీనిని సహజ గర్భనిరోధకంగా ఉపయోగించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే దీనిని కుటుంబ నియంత్రణ పద్ధతిగా ఉపయోగించడం శాస్త్రీయంగా నిర్ధారించిన సురక్షిత విధానం కాదని గుర్తుంచుకోవాలి.కోడిగుడ్లను తింటే..పచ్చి బొప్పాయిలో ఉండే పెపైన్ ఎంజైమ్ ప్రొజెస్టిరాన్ ఉత్పత్తిపై ప్రభావం చూపి గర్భాశయంలోని ఎండోమెట్రియం అభివృద్ధిని దెబ్బతీస్తుంది. దీంతో పిండం ఎదుగుదలకు అనుకూల వాతావరణం ఏర్పడే అవకాశం దెబ్బ తింటుందని కొన్ని పరిశోధనలు పేర్కొన్నాయి. అలాగే లేటెక్స్ కూడా గర్భాశయ సంకోచాలను ప్రేరేపించి గర్భస్రావ ప్రమాదాన్ని పెంచుతుందని వెల్లడించాయి.

# ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**– ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం కోటేశ్వరరావు**



**ఆదాబ్ సైబరాబాద్,ములుగు:**ములుగు జిల్లా లోని తాడ్వాయి మండల కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మండల అధ్యక్షులు మోకాళ్ళ వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది దీనికి ముఖ్య అతిథిగా ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి హాజరైనారు మండల అధ్యక్షులు ముందుగా మాట్లాడుతూ మన హక్కులను మనం కాపాడుకోవాలంటే ప్రతి గూడెం ప్రతి గ్రామం ఆగస్టు 9వ తారీఖున ఆకుపచ్చ జెండాను ఎగరవేయాలి అని అన్నాడు తర్వాత ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 1/70 చట్టం మరియు 1/59 పిసా చట్టం మరియు అటవీ హక్కుల పట్టాలు ఉన్నటువంటి కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదు ఆగస్టు 9వ తారీఖున ప్రతి పల్లె గ్రామంలో ఆకుపచ్చని జెండాలను ఆవిష్కరించాలన్నారు ఆదివాసుల విశిష్ట సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా భారీ ఎత్తున కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు ఆదివాసి హక్కులు ఆత్మ గౌరవం కోసం ఆదివాసి సమాజమంతా ఏకమై యువతి యువకులు పెద్దలు ఈ ఉత్సవాలను ఈ వేడుకలను సంతోషంగా జయప్రదము చేయాలని తుడుం దెబ్బ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం కోటేశ్వరరావు కోరారు

# బోనాల ఏర్పాట్లను పరిశీలించిన మల్కాజిగిరి జోనల్ కమిషనర్



**ఆదాబ్ సైబరాబాద్, మల్కాజిగిరి :** బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన పౌర సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టిన ఏర్పాట్లను మల్కాజిగిరి జోనల్ కమిషనర్ బుధవారం మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని వివిధ ఆలయాలను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఆలయాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, రహదారుల పరిస్థితి, డ్రైనేజీ వ్యవస్థ, ఘన వ్యర్థాల నిర్వహణ, దోమల నివారణ చర్యలను ఆయన సమీక్షించారు. భక్తులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు అన్ని పౌర సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పండుగ సమయంలో తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అన్ని శాఖ ు సమన్వయంతో పనిచేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని ఆదేశించారు.ఈ తనిఖీలలో డిప్యూటీ కమిషనర్ (మల్కాజిగిరి), డీఈఈ (ఎస్‌డబ్ల్యూఎం), డీఈఈ (ఎలక్ట్రికల్), డీడీ (యూబీడీ), ఏఈ (మెయింటెనెన్స్)తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


# సంతోష్‌నగర్‌లో 20 అడుగుల రోడ్డుపై కబ్జా యత్నం

**– మాజీ కార్పొరేటర్ కుటుంబంపై కాలనీవాసుల ఆరోపణలు – ప్రభుత్వ భూమిని కాపాడాలని అధికారులకు విజ్ఞప్తి**




**ఆదాబ్ సైబరాబాద్, జవహర్‌నగర్ :** జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్ కాలనీలో సర్వే నంబర్లు 432, 433లోని ప్రభుత్వ భూమిలో ఉన్న 20 అడుగుల రహదారిని రాత్రికి రాత్రే కబ్జా చేసేందుకు మాజీ కార్పొరేటర్ కుటుంబ సభ్యులు, మరికొందరు వ్యక్తులు ప్రయత్నించారని కాలనీవాసులు ఆరోపించారు.గత 30 ఏళ్లుగా ఈ రహదారినే వినియోగిస్తున్నామని, బాలాజీనగర్ ప్రధాన రహదారి నుంచి కాలనీకి వెళ్లే మార్గంలో గోడ నిర్మాణం చేపట్టి రాకపోకలను అడ్డుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. రాత్రివేళ రౌడీ మూకలను తీసుకొచ్చి స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు.గతంలో ఇదే సర్వే నంబర్లలోని సుమారు 1,500 గజాల ప్రభుత్వ భూమిని మోడ్రన్ టాయిలెట్ల నిర్మాణానికి కేటాయించారని, ఆ స్థలాన్ని కూడా ఆక్రమించారని పేర్కొన్నారు. కబ్జాలను తొలగించేందుకు వచ్చిన ప్రభుత్వ అధికారులపై గతంలో పెట్రోల్ దాడి జరిగినట్లు ఆరోపిస్తూ, వెంటనే అధికారులు, పోలీసులు స్పందించి రహదారిని కబ్జాదారుల నుంచి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు.

# ఆరోగ్యంగా ఉండాలంటే ఆయుర్వేద ప్రకారం ఎవరు ఎలాంటి ఆహారం తీసుకోవాలి..?



ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం మంచి ఆహారం తీసుకోవడం మాత్రమే కాదు, ఆ ఆహారం శరీరంలో సరిగ్గా జీర్ణమై పోషకాలుగా మారడం కూడా అంతే ముఖ్యమని ఆయుర్వేదం చెబుతోంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ వైద్య విధానం ప్రకారం ప్రతి వ్యక్తి శరీర తత్వం భిన్నంగా ఉంటుంది. అందువల్ల అందరికీ ఒకే రకమైన ఆహారం సరిపోదని, వ్యక్తిగత శరీర స్వభావానికి అనుగుణంగా ఆహారాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిస్తోంది. ఆయుర్వేదం ప్రకారం మంచి ఆరోగ్యానికి మూలం బలమైన జీర్ణవ్యవస్థ. ఆహారం సక్రమంగా జీర్ణమై శరీరానికి అవసరమైన శక్తిని అందించినప్పుడు జీవక్రియలు సమతుల్యంగా పనిచేస్తాయి. వ్యక్తి శారీరక అవసరాలకు అనుగుణంగా తీసుకునే ఆహారం ఔషధంలా పనిచేసి జీవక్రియలను సమతుల్యం చేయడంతోపాటు శరీరానికి ఉత్సాహాన్ని, చైతన్యాన్ని అందిస్తుందని ఆయుర్వేదం పేర్కొంటోంది.మనిషి ప్రకృతిలో భాగమేనని భావించే ఆయుర్వేదం శరీరాన్ని మూడు ప్రధాన దోషాల ఆధారంగా వివరిస్తుంది. అవే వాత, పిత్త, కఫ. ఈ మూడు శక్తులు ప్రతి వ్యక్తిలో వేర్వేరు నిష్పత్తుల్లో ఉంటాయని, వాటి ఆధారంగానే ఆహార అవసరాలు కూడా మారుతాయని చెబుఓంది. అందుకే ఒకరికి అనుకూలమైన ఆహారం మరొకరికి తప్పనిసరిగా సరిపోవాల్సిన అవసరం లేదని వివరిస్తోంది. వాత దోషం అధికంగా ఉన్నవారికి ఉడికించిన ధాన్యాలు, వెన్న, పాల పదార్థాలు, గింజలు, ఉడికించిన కూరగాయలు అనుకూలంగా ఉంటాయి. అయితే పచ్చి సలాడ్లు, ఎక్కువ పండ్లు, బీన్స్ వంటి ఆహారాలను పరిమితంగా తీసుకోవడం మంచిది. పిత్త దోషం ఎక్కువగా ఉన్నవారికి పచ్చి సలాడ్లు, ఉడికించిన ధాన్యాలు, పాలు, విత్తనాలు అనుకూలమైన ఆహారాలు కాగా ఎక్కువ కారం, వేడి పదార్థాలు, పులుపు ఎక్కువగా ఉన్న ఆహారాలు, డీప్ ఫ్రై చేసిన వంటకాలు, పెరుగు, వెనిగర్ వంటి పులియబెట్టిన పదార్థాలను తగ్గించాలి.

కఫ దోషం ఉంటే..కఫ దోషం అధికంగా ఉన్నవారు సలాడ్లు, ఉడికించిన కూరగాయలు, మసాలా ఆహారం, క్వినోవా, మిల్లెట్స్, మొక్కజొన్న పిండి, బక్‌వీట్ వంటి ఆహారాలను తీసుకోవడం మంచిది. పాల పదార్థాలు, మాంసాహారం, చీజ్, గింజలు, గోధుమలు, బియ్యం వంటి ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి. ఆయుర్వేదం సూచించే సాధారణ ఆహార నియమాల్లో తాజా ఆహారానికి మొదటి ప్రాధాన్యం ఉంటుంది. సీజన్‌కు అనుగుణంగా స్థానికంగా పండిన తాజా ఆహారాల్లోనే అధిక పోషకాలు లభిస్తాయి. ప్రాసెస్ చేసిన ఆహారాల కంటే సహజమైన సంపూర్ణ ధాన్యాలు, సంపూర్ణ పండ్లు, కాలానుగుణ కూరగాయలను మంచిది.

# డయల్ 100ను ఆశ్రయించే వారికి నిరీక్షణే

హైదరాబాద్: ప్యాట్రోలింగ్, బ్లూకోల్ట్స్ పేరిట ప్రత్యేక సిబ్బంది, ఆధునాతన వాహనాలు అందుబాటులో ఉన్న నగర పోలీసు విభాగంలో డయల్? 100ను ఆశ్రయించే వారికి నిరీక్షణే మిగులుతోంది. ముఖ్యంగా రాత్రి వేళ ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. విధుల్లో ఉండే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయి. ఆగస్టు 1వ తేదీ అర్ధరాత్రి ఐకియా సమీపంలో రోడ్డు ప్రమాదం అనంతరం బాధితుడు డయల్ 100కు కాల్ చేసి సాయం కోరాడు. రాత్రి విధుల్లో ఉన్న గచ్చిబౌలి హెడ్ కానిస్టేబుల్ ఘటనాస్థలికి వెళ్లనే లేదు. సాంకేతిక కారణాలు సాకుగా చూపి 2 ఫిర్యాదుల్ని క్లోజ్ చేశాడు. విషయం గుర్తించిన సీపీ రమేశ్ హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. నిర్లక్ష్యమే కారణామా : డయల్ 100కు సమాచారం అందాక సగటున 5–8 నిమిషాల్లో ఘటనా స్థలికి చేరుకుంటున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నారు. శివారులో సగటున అరగంట సమయానికి చేరుతున్నారు. డయల్ 100 ఫిర్యాదు విషయంలో స్పందన ఆలస్యం కావొద్దనే ఉద్దేశంతో పోలీసు శాఖ కొన్ని మార్పులు తీసుకొచ్చింది. డయల్ 100కు ఫోన్




చేసిన వ్యక్తి లైన్లో ఉండగానే స్థానిక పోలీస్ స్టేషన్?కు సమాచారం చేరేలా మార్పులు చేశారు. దానిద్వారా ప్యాట్రోలింగ్, బ్లూకోల్ట్ సిబ్బంది అప్రమత్తమై ఘటనాస్థలానికి చేరుకుంటారని పోలీసు శాఖ ఉద్దేశం. కానీ రాత్రివేళ విధుల్లో సిబ్బంది కొన్ని ఫోన్లను సీరియస్‌గా తీసుకోకపోవడం, రోడ్డు ప్రమాదాలను పట్టించుకోకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌లో డయల్? 100కు సరిగా స్పందించడం లేదని ఉన్నతాధికారులు గుర్తించారు. ఫిర్యదుదారుల సమాచారం: ఆలస్యంగా స్పందించడం ఒక కారణమైతే సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు బయటకు రావడం ఇబ్బందికరంగా మారుతోంది. అర్ధరాత్రి వేళ కాలనీల్లో బ్యాండ్? మోతలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, గంజాయి బ్యాచ్?లు, అల్లరి చేసే వ్యక్తుల గురించి స్థానికులు డయల్ 100కు సమాచారం ఇస్తుంటారు. పోలీసులు వెళ్లి అల్లరి మూకల్ని అదుపులోకి తీసుకుంటున్నా ఎవరు ఫిర్యాదు చేశారో చెబుతున్నారు. దీంతో తమపై ఎందుకు ఫిర్యాదు చేశావంటూ నిందితులు, బాధితులు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. మేడ్చల్ మునీరాబాద్‌లో వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని జులై 29న స్థానికులు పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా, పది నిమిషాల్లో వస్తున్నామని చెప్పి గంటన్నర వరకు వెళ్లలేదు. మరో పోలీసు స్టేషన్‌లో ప్యాట్రోలింగ్‌కు వెళ్లడం వల్లే ఆలస్యం జరిగినట్లు సిబ్బంది స్థానికులకు బదులిచ్చారు. 24 గంటల పాటు సేవలు : రాష్ట్రంలోని ఫిర్యాదులు 24 గంటలపాటు నేరుగా హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళ్తాయి. ఓ వైపు స్పందించని సిబ్బంది, మరో నూరు శాతం సేవలు పోలీసులు సేవలు అందిస్తున్నారు. కంట్రోల్ రూమ్ నుంచి జిల్లాలోని పోలీస్? స్టేషన్‌లకు చేరవేస్తుంటారు. ఫిర్యాదు అందుకున్న ఠాణా పరిధిలోని బ్లూకోర్ట్స్?, పెట్రోలింగ్? సిబ్బంది ఆయా పరిధిలోకి 5 నుంచి 10 నిమిషాల వ్యవధిలో ఘటన స్థలానికి చేరుకుంటారు. ఇలా రోడ్డు ప్రమాదంలో గాయపడిన అనేక మందిని డయల్?–100 ద్వారా వచ్చిన ఫిర్యాదులతో పోలీసులు సకాలంలో ఆసుపత్రులకు తరలించి ప్రాణాలు రక్షించారు. ఫిర్యాదు నుంచి సమస్య పరిష్కారం వరకు డయల్?–100 విభాగం అధికారులు పర్యవేక్షిస్తుంటారు. "కమిషనరేట్? పరిధిలోకి వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై స్పందిస్తాం. డయల్–100కు వచ్చే ఫిర్యాదులపై మరింత శ్రద్ధ వహిస్తున్నాం. కాల్స్? వచ్చిన వెంటనే ఘటన స్థలానికి చేరుకొని పూర్తిస్థాయి సమాచారం సేకరించి అత్యవసర సేవలు అందించడానికి ముందుంటాం. డయల్?–100లో ఫిర్యాదులు చేసినా తమ సిబ్బంది స్పందించకుంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి" –

# ఆర్ఎస్ ప్రవీణ్.. కల్వకుంట్ల కుటుంబానికి ఊడిగం చేస్తున్నారు

**హైదరాబాద్, ఆగస్టు 5:** బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. (బుధ వారం) మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ డస్ట్ బిన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ టిష్యూ పేపర్ అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత ప్రవీణ్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఒకే పోస్టు లో ఏడు సంవత్సరాలు ఉన్నారని ఆరోపిం చారు. ప్రవీణ్ కుమార్ జాతి ద్రోహి అని.. బీఎస్పీ పార్టీని కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శించారు. ఐపీఎస్‌గా చేసిన వారు కూడా ఇలా ప్రవర్తించడం దారుణమని సంపత్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబ మాయమాటల మత్తులో ఆర్ఎస్ ప్రవీణ్ ఉన్నారని... ఆ కుటుంబానికి ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. లీగల్ నోటీసులు ఎప్పుడు పంపుతారో హరీశ్ రావుకు తెలియదా?.. అడ్వకేట్ ఉన్నారు కదా అని




నోటీసులు పంపిస్తే ఎలా అని ప్రశ్నించారు. క్షుద్రపూజల ఆరోపణలపై హరీశ్ సమాధానం చెప్పాలని.. సమాధానం చెప్పకుండా నోటీసులు పంపడం విడ్డూరమని సంపత్ కుమార్ వ్యాఖ్యానించారు.

# ఫేక్ ఎన్ఓసి లపై విచారణ జరుగుతోంది: అభిలాష అభినవ్

హైదరాబాద్: ఇంటర్మీడియట్ కాలేజీలకు ఫైర్ ఎన్ఓసి కంపల్సరీ చేశామని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డుకు వచ్చిన కొన్ని ఫైర్ ఎన్ఓసి హైడ్రాతో సంప్రదించి పరిశీలి ంచగా, కొన్ని సర్టిఫికెట్లు బోగస్‌గా ఉన్నట్లు గుర్తిం చామన్నారు. హైడ్రాకు వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇంటర్మీడియట్ బోర్డుకు అందడంతో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఫేక్ చీటీజల వ్యవహారంపై విచారణ కొనసాగుతోందని, విచారణ పూర్తయిన తర్వాత ఎన్ని నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారనే విషయం స్పష్టమవుతుందని తెలిపారు. ఫేక్ చీటీజలపై కఠిన చర్యలునకిలీ ఫైర్ చీటీజల విషయంలో హైడ్రా, ఇంటర్మీడియట్ బోర్డు సీరియస్‌గా ఉన్నాయని అభిలాష అభినవ్ వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇంటర్మీడియట్ బోర్డు స్థాయిలో అంతర్గత విచారణ కూడా చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీల పై తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని




పేర్కొన్నారు. విద్యార్థులు ఆందోళన చెందొద్దు ఫేక్ ఎన్ఓసిల వ్యవహారంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అభిలాష అభినవ్ తెలిపారు. కాలేజీల అనుమతులకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటే వెబ్‌సైట్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చని సూచించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 3 వేలకుపైగా ఇంటర్మీడియట్ కాలేజీలు పొందినట్లు ఇంటర్మీడి యట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు.

# ఆర్టీసీ బస్సుల్లోనూ అడ్వాన్స్ టికెటింగ్ - మెట్రో తరహాలో ముందస్తుగా బుకింగ్

హైదరాబాద్: హైదరాబాద్ నగర ప్రయాణికుల సౌకర్యం కోసం టీజీఎస్ ఆర్టీసీ సరికొత్త విధానం అందుబాటులోకి తీసుకువస్తుంది. బస్సు ఎక్కే ముందే టికెట్ (అడ్వాన్స్, బోర్డింగ్ టికెటింగ్) పాలసీని త్వరలో ప్రవేశపెట్టనుంది. హైదరాబాద్ మెట్రో రైలు తరహాలో ఈ విధానం ఉంటుంది. మీ టికెట్ యాప్‌లోనే ఈ ఫీచర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో పాటు విద్యార్థులకు డిజిటల్ బస్‌పాస్‌లను జారీ చేసేందుకు ఆర్టీసీ తీవ్ర కసరత్తు చేస్తోంది. 23 శాతం ఆన్‌లైన్ చెల్లింపులే : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 3200కి పైగా బస్సుల్లో రోజూ 26 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో 70 శాతం మంది మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణికులే. రోజూ ఆర్టీసీకి రూ.6.5 కోట్ల ఆదాయం వస్తోంది. ఇందులో 23 శాతం డిజిటల్ చెల్లింపులే ఉంటున్నాయి. తాజా విధానంతో డిజిటల్ చెల్లింపుల సంఖ్య




మరింత పెరగనుంది. నిత్యం ఉదయం, సాయంత్రం బస్సుల్లో అడుగు పెడదామంటే విపరీతమైన రద్దీతో భయమేస్తుంది. అంతలా ఉంటోంది రద్దీ. ఆ సమయంలో సీటు దొరక్క నిల్చుని జనాల మధ్య నుంచి టికెట్ తీసుకోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. మొబైల్ యాప్‌లో బోర్డింగ్ స్టాప్ : కొన్నిసార్లు డిజిటల్ చెల్లింపుల్లో టెక్నికల్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఈ క్రమంలో టికెట్ జారీలో ఆలస్యమై బస్సు వేగం, షెడ్యూల్‌పై వేగంగా ప్రభావం పడుతోంది. ప్రయాణానికి ముందే టికెట్ తీసుకోవడం ద్వారా అటు కండక్టర్లు, ఇటు ప్రయాణికులకు చాలా రకాల ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రయాణికులు వారి మొబైల్ యాప్‌లో బోర్డింగ్ స్టాప్, గమ్యస్థానం ఎంచు కొని యూపీఐ లేదా కార్డ్స్‌తో ముందే టికెట్‌ను బుకింగ్‌ను చేయవచ్చు. గమ్యం యాప్ ద్వారా బస్సులు ఎక్కడున్నాయో ట్రాక్ చేస్తూ టికెట్‌లో పేర్కొన్న సమయం ఆధారంగా ప్రయాణికులు వారి ప్రయాణాలను ముందస్తుగానే ప్లాన్ చేసుకోవచ్చు. విద్యార్థులకు డిజిటల్ బస్‌పాస్‌ల జారీ : ఆర్టీసీ ప్రవేశపెట్టిన డిజిటల్ బస్‌పాస్‌లకు ప్రయాణికులచేసుకోవచ్చు. విద్యార్థులకు డిజిటల్ బస్‌పాస్‌ల నుంచి మంచి స్పందన లభిస్తోంది. మీ టికెట్ మొబైల్ యాప్ ద్వారా ఫిబ్రవరి 25న ప్రారంభించగా ఇప్పటివరకు 14 వేల మందిని ఈ డిజిటల్ పాస్‌లను వినియోగించుకున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. దీంతో రూ.2 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ప్రస్తుతం ఇందులో సిటీ ఆర్డినరీ, మెట్రో డీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, పుష్పక్ బస్‌పాస్‌లు, టీ–24 టికెట్లు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. తాజాగా విద్యార్థుల బస్‌పాస్‌ల జారీకి ఆర్టీసీ నిర్ణయించింది. దీంతో బస్‌పాస్ కౌంటర్ల వద్ద రద్దీ, సిబ్బందిపై చాలా వరకు భారం తగ్గనుంది. చిలకలగూడలో కొత్త బస్ టెర్మినల్ : హైదరాబాద్?లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆర్టీసీ ముమ్మర చర్యలు చేపడుతోంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లోని రద్దీని తగ్గించేందుకు చిలకలగూడలో కొత్త బస్ టెర్మినల్, ఛార్జింగ్ స్టేషన్‌ను నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సౌత్ సెంట్రల్ రైల్వే, ఆర్టీసీల మధ్య కుదిరిన ఉమ్మడి భూ బదిలీ ఒప్పందం ఆధారంగా ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు కానుంది.

# హైదరాబాద్‌లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంక్ట్రాక్ట్ క్యారేజ్ వాహనాల నిర్వాహకులు

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో కాంట్రాక్ట్ క్యారేజ్ వాహనాలకు ఇన్సూరెన్స్ ఉండదు, పీయూసీ(పొల్యూషన్ అండర్ కంట్రోల్) సర్టిఫికెట్ తీసుకోరు. చివరికి పర్మిట్ కూడా లేకుండానే రోడ్లెక్కుతున్నాయి. ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో ఇన్సూరెన్స్ చేయని వాహనాలే ఎక్కువగా ఉంటున్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో స్థానంలో పీయూసీ లేనివి, పర్మిట్ లేనివి ఉన్నాయి. మధ్యలో ఎవరినీ ఎక్కించుకోకుండా ప్రయాణికులను ఒకచోటు నుంచి మరో చోటుకు చేరవేసే ఈ కాంట్రాక్ట్ క్యారేజ్‌లకు పర్మిట్ లేకపోవడంతో ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 116 కేసులను సంబంధిత అధికారులు నమోదు చేశారు. టూరిస్టు బస్సులు, వ్యాన్లు, నగరం నుంచి దూరప్రాంతా



లకు వెళ్లే ప్రైవేటు బస్సులు కూడా కాంట్రాక్ట్ క్యారేజ్‌ల విభాగంలోకే వస్తాయి. ప్రైవేటు బస్సులు పేరుకు కాంట్రాక్ట్ క్యారేజ్‌లు అయినప్పటికీ అవి నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆపుతూ ప్రయాణికులను ఎక్కిం చుకుంటున్నాయి. అధికశాతం ఆటోలు ఈ విభాగంలోనే ఉన్నా యి. రాత్రి 10 తర్వాతే ట్రావెల్స్ బస్సులు రోడ్లపైకి రావాలని ట్రాఫిక్ అధికారులు సూచిం చినప్పటికీ 9 గంటల నుంచే రహదారులపైకి రావడంతో పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. బీమా చేయడం తప్పనిసరి : ఇన్సూరెన్స్ లేని వాహనం ప్రమాదానికి గురై ఇతరులకు నష్టం కలిగించినట్లయితే సంబంధిత వాహన యజమానే బాధితుడికి పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. అందుకే చాలామంది థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌తో సరిపెడుతున్నారు. కొందరు అవీ తీసుకోవడం లేదు. నిత్యం తిరిగే ట్రావెల్స్ బస్సులకు బీమా చేస్తారు. ఆటోలు, ఇతర చిన్న వాహనాలు, స్థానికంగా తిరిగే వాహనదారులు అదో అదనపు భారంగా భావిస్తుంటారు. ఇన్సూరెన్స్ తప్పక చేయించుకోవాలి. అది వాహన యజమాని, డ్రైవర్‌ను ఆదుకునే రక్షాపత్రం అని చెప్పవచ్చు. గత 7 నెలల్లో వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేకపోతే రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు ఒక్కో జోన్ పరిధిలో సగటున సుమారు 375 చొప్పున కేసులు నమోదయ్యాయి. ఇతర నిబంధనల ఉల్లంఘన కింద ఒక్కోల 150కి పైగానే కేసులు నమోదయ్యాయి.

# గాంధీభవన్‌కు చేరిన కాంగ్రెస్ నేతల వర్గపోరు..

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అంటే ఎవరి కుంపటి వారిదే అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. గ్రూపు రాజ కీయాలకు కేరాఫ్ అడ్రస్ ఏంటంటే కాంగ్రెస్ పార్టీ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఎప్పుడూ ఏదో ఒక చోట గ్రూప్ వార్ బయటకు వస్తూనే ఉంటుంది. తాజాగా కొమురం భీం



ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలు రచ్చకెక్కాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నూతన మండల అధ్యక్షుల ప్రకటనలో డీసీసీ అధ్యక్షు రాలు సుగుణక్క ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు వర్గం ఫైర్ అవుతోంది. పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్లను కాదని, కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి పదవులు ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ వాట్సాప్ గ్రూపుల్లో రెండు వర్గాల మధ్య మాటల యుద్ధం నెలకొంది. ఆ యుద్ధం సెగ కాస్తా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు తాకింది.


# రోడ్డును తీసుకుంటే..ఊరును తీసుకోవాలని గ్రామస్థుల ధర్నా




**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టు( ) కోసం తమ గ్రామ రోడ్డును తీసుకుంటే మొత్తం గ్రామాన్ని తీసుకోవాలని కోరుతూ అనుకుంటా గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. బుధవారం గ్రామానికి చెందిన రైతులు కలెక్టరేట్‌కు తరలివచ్చి బైఠాయించి నిరసన తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల నష్టపోతున్న తమ భూములకు రూ.6 కోట్లు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. గ్రామస్థులు ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణానికి చేరుకోవాలంటే కేవలం రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ప్రయాణం చేస్తుండగా రోడ్డు ఎయిర్‌పోర్టులో పోతే 16 కిలోమీటర్లు దూర భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముందని పేర్కొన్నారు. రోడ్డుతో పాటు తమ గ్రామాన్ని మొత్తం తీసుకొని ఇతర ప్రాంతంలో తమకు పునరావసం కల్పించాలని కోరారు.

# 142 ఫైర్ ఎన్వోసీల్లో 52 నకిలీవే

హైదరాబాద్: హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీకి గురైంది. పలు ప్రైవేట్ ఇంటర్ కళాశాలలు అక్రమంగా ఫైర్ ఎన్వోసీలు పొందేందుకు ఆయన సంతకం ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. పలువురు ఉన్నతాధికారుల ఫోర్జరీ సంతకాలతోనే ప్రైవేట్ కాలేజీలు ఇంటర్‌బోర్డుకు ఫైర్ ఎన్వోసీలు సమర్పించినట్లు వెల్లడైంది. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని మొత్తం 142 ఫైర్? ఎన్?వోసీల్లో 52 నకిలీవేనని అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆయా కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్ బోర్డుకు అధికారులు మంగళవారం ఫిర్యాదు చేశారు. జీహెచ్?ఎంసీ కమిషనర్ సంతకమూ ఫోర్జరీ : అగ్నిమాపక నిరభ్యంతర ధ్రువపత్రాల కోసం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు కీలక అధికారుల సంతకాలను కూడా పలు కాలేజీ యాజమాన్యాలు ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. గతంలో అగ్నిమాపక శాఖలో పనిచేసి బదిలీ అయిన ఉన్నతాధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ సంతకాలు కూడా ఫోర్జరీ జరిగినట్టు తేల్చారు. అయితే ఈ



వ్యవహారంలో సూత్రధారులెవరు? పాత్రదారులెవరు అనే కోణంలో పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు. 90లో 52 నకిలీ ఎన్?వోసీలే : తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో 142 జూనియర్ కళాశాలలు ఫైర్ ఎన్వోసీలు సమర్పించాయి. అందులో 90 వరకు ఒరిజనల్‌వి ఉండగా 52 ధ్రువపత్రాలు నకిలీవేనని తేలింది. వీటిని సమర్పించిన వారిపై తదుపరి చర్యలకు ఉద్దేశించి జులై 4న నెక్లెస్ రోడ్డులోని లేక్ పోలీసు స్టేషన్లో కేసు కూడా హైడ్రా నమోదు చేసింది. 2025–26, 2026–27 విద్యా సంవత్సరాలకు సంబంధించి జూనియర్ కళాశాలల యాజమాన్యాలు సమర్పించిన ఫైర్ ఎన్వోసీల ప్రతులన్నిటినీ హైడ్రా నిశితంగా పరిశీలించగా ఈ విషయం వెల్లడైంది. సింహభాగం నకిలీ? ధ్రువపత్రాలే : మొదటి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్––మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు (డీఐఈవో) మొత్తం 76 ఫైర్ ఎన్వోసీలను ప్రామాణికత నిర్ధారణ కోసం పంపించారు. వాటిని హైడ్రా కార్యాలయ రికార్డులతో పరిశీలించగా, 7 ఫైర్ ఎన్వోసీలు నకిలీవని తేలింది. రెండో దశలో సంబంధిత జిల్లా డీఐఈవోలు మొత్తం 66 ఫైర్ ఎన్వోసీలను ధ్రువీకరణ కోసం పంపించారు. వీటిని కూడా హైడ్రా కార్యాలయ రికార్డులతో పరిశీలించగా, 45 ఫైర్ ఎన్వోసీలు నకిలివేనని తేలింది. ఈ మేరకు ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డుకు హైడ్రా సూచించింది. ఫోర్జరీ ఎన్వోసీలు పొందిన పలు కాలేజీలివే : హైదరాబాద్?లో కీలక ప్రాంతాల్లోని పలు ప్రైవేట్ ఇంటర్ కాలేజీలు ఫైర్ ఎన్వోసీల కోసం ఉన్నతాధిారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. తొలి విడత తనిఖీల్లో మెహిదీపట్నంలో ప్రియాంక ఇంటర్మీడియట్ కాలేజీ, విద్యానగర్?లోని మదర్స్ గర్ల్స్, చాంద్రాయణగుట్టలోని శ్రీచంద్ర, చిక్కడపల్లిలోని న్యూ ఎరా, శివరాంపల్లిలోని షాహీన్, తెల్లాపూర్‌లోని వశిష్ట, బర్కత్‌పురాలోని హైందవి, ఎస్ఆర్‌నగర్‌లోని రెజోనెన్స్ కాలేజీలు ఉన్నతాధికారుల ఫోర్జరీ సంతకాలతోనే నకిలీ ఎన్వోసీలను ఇంటర్ బోర్డుకు పంపించినట్లు అధికారులు గుర్తించారు. బోర్డులోని అధికారులు కుమ్మక్కు? : ఉన్నతాధికారుల సంతకాల ఫోర్జరీకి పాల్పడిన కళాశాలల గుర్తింపు కూడా రద్దు చేయాలని హైడ్రా అధికారులు ఇంటర్‌బోర్డును కోరారు. అయితే కొందరు ఇంటర్‌బోర్డులోని అధికారులు కూడా ఈ వ్యవహారంలో కుమ్మక్కైనట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మొత్తంగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. దర్యాప్తులో ఎటువంటి విషయాలు వెలుగు చూస్తాయో వేచి చూడాల్సి ఉంది.

# ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదు



**అమరావతి, ఆగస్టు 5:** హిందూ దేవుళ్లపై సోషల్ మీడియాలో పోస్ట్‌లు, నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై సైబర్ డీజీ రవిశంకర్‌కు బీజేపీ నేతల బృందం ఫిర్యాదు చేసింది. 57 మంది వివరాలతో బీజేపీ నేతలు భానుప్రకాశ్ రెడ్డి, వల్లూరు జయప్రకాశ్, షేక్ బాజీ, శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాశ్ మాట్లాడుతూ.. భారత సంస్కృతిలో శ్రీరామచంద్రుడిని ఆరాధ్య దైవంగా చూశామని.. దేవతా మూర్తులు మాతా సరస్వతి, లక్ష్మీదేవి, సీతమ్మను తల్లిగా భావిస్తున్నామని తెలిపారు.హిందూ దేవుళ్లపై అనరాని మాటలు అంటున్నారని భాను ప్రకాశ్ మండిపడ్డారు. ఆ వీడియోలను చూడలేకపోయామన్నారు. హిందూ దేవుళ్లను ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. 'ఒళ్లు జాగ్రత్త, తోలు తీస్తాం! వదిలే ప్రసక్తే లేదు!' అని హెచ్చరించారు. హిందూ దేవుళ్లపై ప్రకాశ్ రాజ్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శ్రీరామచంద్రుడు ఉత్తర దేశం నుంచి దక్షిణ దేశానికి వచ్చారని, పండ్లు దొంగిలించారని చెబుతున్నారని ఫైర్ అయ్యారు. దమ్ము, ధైర్యం ఉంటే అన్యమతస్తుల్లో జరుగుతున్న అన్యాయాల గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు. కేవలం హిందూ మతం, హిందూ దేవుళ్లపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని.. ఇటువంటి వారిని కఠినంగా శిక్షించాలని భానుప్రకాశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

# వైఎస్సార్సీపీ నేత మళ్ల విజయప్రసాద్ నివాసాలు, కార్యాలయాలపై ఈడీ దాడులు

**విశాఖ:** మంత్రి నారా లోకేశ్ విశాఖలో పర్యటించారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి "పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్" నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీవీ సింధు మాట్లాడారు. ఏ సంస్థకైనా నిజమైన పునాది స్పష్టమైన లక్ష్యమేనని, ఈ క్రీడా ప్రాజెక్ట్ రూపకల్పనలో తనకు అండగా నిలిచి, పూర్తి మద్దతు అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీనిని రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌లో 25 మీటర్ల ఇండోర్ షూటింగ్ రేంజ్, 7 ప్రధాన క్రీడా విభాగాలు, నూతన క్రీడాంశాలు అందుబాటులో ఉండనున్నాయని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఏర్పాటు చేయనున్న 25 మీటర్ల స్విమ్మింగ్ పూల్‌ను, ఒలింపిక్స్ పోటీల్లో వాడే "మిర్తా పూల్స్" (ఇటలీ) ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు విశాఖకు చేరుకున్న మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఇతర ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలను కలిసి లోకశ్ అర్జీలు స్వీకరించారు.హైదరాబాద్‌లోనూ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఏ సంస్థకైనా నిజమైన పునాది స్పష్టమైన లక్ష్యమే. ఈ క్రీడా ప్రాజెక్ట్ రూపకల్పనలో అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్. ఈ ప్రాజెక్ట్‌లో 25 మీటర్ల ఇండోర్ షూటింగ్ రేంజ్ అందుబాటులో ఉంటుంది. ఏడు ప్రధాన క్రీడా విభాగాలు, నూతన క్రీడాంశాలు అందుబాటులో ఉండనున్నాయి. 25 మీటర్ల స్విమ్మింగ్ పూల్, ఒలింపిక్స్‌లో వాడే మిర్తా పూల్స్ ప్రమాణాలతో




నిర్మిస్తున్నాం. విశాఖలో క్రీడాకారులకు అనేక అవకాశాలు ఉన్నాయి. సీఎం చంద్రబాబు క్రీడాకారులకు అనేక అవకాశాలు కల్పిస్తున్నాం. విశాఖలో సెంటర్ నిర్మాణానికి లోకేశ్ శంకుస్థాపన చేయడం సంతోషం. - పీవీ సింధు, బ్యాడ్మింటన్ క్రీడాకారిణిప్రపంచ స్థాయి క్రీడాకారులకి ఈ సంస్థ వేదిక కానుంది: పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణ పనులకు లోకేశ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడారు. అకాడమీ ద్వారా ప్రతిభను మరింత మెరుగుపరచుకోవచ్చు అన్నారు. ఏ సదుపాయాలు లేని రోజుల్లోనే ఒలంపిక్ పతక విజేతగా సింధు ఎదిగారు అని కొనియాడారు. పట్టుదల, క్రమశిక్షణతో సింధు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచారన్నారు. ప్రతి ఛాంపియన్ వెనుక తల్లిదండ్రులు, కోచ్‌లు ఉంటారన్నారు. అన్ని క్రీడలకు కేంద్రంగా అకాడమీని తీర్చిదిద్దాలనేది సీఎం ఆలోచన లోకేశ్ తెలిపారు. ప్రపంచస్థాయి క్రీడాకారుల తయారీకి ఈ సంస్థ వేదిక కానుందని లోకేశ్ పేర్కొన్నారు.

# శ్రీశైలానికి కొనసాగుతున్న వరద - 118 టీఎంసీలు దాటిన నీటిమట్టం



**శ్రీశైలం:** జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి శ్రీశైలానికి 2.45 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 863.90 అడుగులకు చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 118.6216 టీఎంసీలుగా ఉంది. ఈ క్రమంలోనే అధికారులు ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. విద్యుత్ ఉత్పత్తి చేసి 4267 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్?కు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.మరోవైపు తుంగభద్ర జలాశయానికి సైతం భారీగా వరద ప్రవాహం వస్తోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయానికి 1,02,698 క్యూసెక్కుల వరద వచ్చింది. ప్రస్తుతం డ్యాంలో 54.42 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి వరద ప్రవాహం వస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఏటా ఆగస్టు నెలలో తుంగభద్ర జలాశయంలో నీరు గరిష్టస్థాయికి చేరి, క్రస్ట్ గేట్ల నుంచి దిగువన నదిలోకి విడుదల చేసేవారు. అదే విధంగా రైతులు వరి నారు పోసుకోవడానికి కూడా జులైలోనే నీటిని విడుదల చేసేవారు.ఈసారి సూపర్ ఎల్?నినో ప్రభావంతో కర్ణాటకలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు తలెత్తి తుంగభద్ర జలాశయానికి ప్రవాహం రాలేదు. దీంతో ఇప్పటి వరకు కేవలం 60 టీఎంసీలు మాత్రమే వచ్చింది. మరో 15 టీఎంసీల నీరు రానుందని అధికారులు అంచనా వేస్తున్నారు.టీఎంసీల నీరు రానుందని అధికారులు గత 24 గంటలుగా జలాశయంలోకి లక్ష క్యూసెక్కుల మేర వరద వస్తోంది. వర్షాలు తగ్గుముఖం పట్టి రేపటి నుంచి వరద కొంత తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈసారి తాగునీటి అవసరాలకు ఇబ్బంది లేకుండా నీరు జలాశయానికి చేరుతోందని చెబుతున్నారు.

# ప్రకాశం జిల్లా అభివృద్ధికి REMZ ప్రాజెక్ట్ కీలకం



**ప్రకాశం, ఆగస్టు 5:** జిల్లాలోని అద్దంకి ప్రాంతంలో రెన్యూవబుల్ ఎనర్జీ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్(్) ఏర్పాటు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. (బుధవారం) మీడియాతో మాట్లాడుతూ. భూములు ఇచ్చిన రైతులకు పారదర్శకంగా రూ.31.57 లక్షల పరిహారం అందించామని చెప్పారు. సోలార్ విద్యుత్ తయారీ కేంద్రం రాష్ట్రంలోనే కీలక పారిశ్రామిక ప్రాజెక్టుగా రూపుదిద్దుకోనుందని అన్నారు. ఇప్పటికే పలువురు పెట్టుబడిదారులు, కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే స్థానిక యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. పారిశ్రామి కాభివృద్ధితో పాటు రైతుల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం సమానంగా కాపాడ ుతోందన్నారు. ప్రకాశం జిల్లాను పారిశ్రామిక ంగా అభివృద్ధి చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్.. 2027 వరకు శ్రీశైలం జలాలను భద్రపరుచుకోవాలి




**అమరావతి, ఆగస్టు 5:** రాయలసీమ తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేశామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. (బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. ఎల్‌నినో నేపథ్యంలో 2027 జూన్ వరకు శ్రీశైలం జలాలను తాగునీటి కోసం భద్రపరచుకోవాలని అన్నారు. నేటికి శ్రీశైలం వద్ద ఉన్న 119 టీఎంసీలకు తోడు, రాబోయే 10 రోజులలో మరొక 100 టీఎంసీల వరకు ఇన్ ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు. కృష్ణా జలాల్లో ఏపీ 63 శాతం వాటాను ప్రథమంగా తాగునీటికే ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్ నీటిని ఎల్‌నినో దృష్ట్యా ప్రథమ ప్రాధాన్యంగా తాగునీటికి విడుదల చేస్తున్నామని తెలిపారు.హంద్రీనీవా పరిధిలోని రిజర్వాయర్లకు తాగునీటి అవసరాల కోసం 13 టీఎంసీలు అవసరమని మంత్రి వెల్లడించారు. పోతిరెడ్డిపాడు పరిధిలోని రిజర్వాయర్లకు తాగునీటి కోసం10 టీఎంసీలను రేపటి నుంచి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.

# ప్రపంచ స్థాయి క్రీడాకారులను పీవీ సింధు అకాడమీ తయారు చేస్తోంది

**విశాఖపట్నంశీ, ఆగస్టు 5 :** ప్రపంచ స్థాయి క్రీడాకారులను ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అకాడమీ తయారు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. యువత ముఖంలోనే దేశ భవిష్యత్తు దాగి ఉందని పేర్కొన్నారు. పీవీ సింధు అకాడమీ ద్వారా క్రీడాకారులు వారిలోని ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ఎలాంటి సదుపాయాలు లేని రోజుల్లోనే పట్టుదల, క్రమశిక్షణతో సింధు ఒలింపిక్స్ పతక విజేతగా, ప్రపంచ ఛాంపియన్‌గా ఎదిగారని ఉద్ఘాటించారు. విశాఖపట్నం అరిలోవ ప్రాంతంలోని తోటగరువులో తలపెట్టిన పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణ పనులకు మంత్రి నారా లోకేశ్ ఈరోజు (బుధవారం) భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగించారు.క్రీడలకు నిలయంగా ఈ అకాడమీ..ప్రతి ఛాంపియన్ వెనుక కష్టపడిన తల్లిదండ్రులు, ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలిచే కోచ్‌లు ఉంటారని మంత్రి



లోకేశ్ వ్యాఖ్యానించారు. కేవలం బ్యాడ్మింటనే కాకుండా, అన్ని రకాల క్రీడలకు కేంద్రంగా ఈ అకాడమీని తీర్చిదిద్దాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ అకాడమీ రూపుదిద్దుకుంటోందని వివరించారు. ఈ సంస్థ బ్యాడ్మింటన్‌కే పరిమితం కాకుండా.. స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడలకు కూడా నిలయంగా మారనుందని వెల్లడించారు. ఆస్ట్రేలియా, ఖతార్ తరహాలో మన దేశంలోనూ ప్రపంచ స్థాయి క్రీడాకారులను తయారు చేసేందుకు ఈ సంస్థ వేదిక కానుందని తెలిపారు.విశాఖపట్నంలో ఈ అకాడమీ నిర్మాణం విజయవంతం కావడానికి తమ ప్రభుత్వం, ప్రజల సహకారం ఎప్పుడూ ఉంటుందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. 90వ దశకంలోనే క్రీడలపై సీఎం చంద్రబాబు నమ్మకం ఉంచారని ప్రస్తావించారు. ఆ మేరకు ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పించి క్రీడా విప్లవానికి చంద్రబాబు బాటలు వేశారని ఉద్ఘాటించారు. ఈ అకాడమీ కేవలం బ్యాడ్మింటన్ మాత్రమే కాకుండా, అనేక క్రీడలకు కేంద్రంగా మారి ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా సంస్కృతిని పెంచుతుందని వివరించారు. తరగతి గది జ్ఞాబ్యాడ్మింటన్ మాత్రమే కాకుండా, అనేక నాన్ని ఇస్తే, క్రీడలు మనకు వ్యక్తిత్వాన్ని, పోరాట పటిమను నేర్పుతాయని చెప్పుకొచ్చారు. అందుకే ఏపీలో ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే'గా ప్రకటించామని తెలిపారు. ప్రతి చిన్నారిలోనూ ఒక సహజ ప్రతిభ దాగి ఉంటుందని వివరించారు. దానిని వెలికితీసి ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# రౌడీయిజాన్ని ప్రదర్శించడం వైసీపీ రాజకీయ సంస్కృతిగా మారింది

**అమరావతి, ఆగస్టు 5:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పర్యటనలో వైసీపీ గొడ్డలిపార్టీ శ్రేణులు బస్సులు అడ్డుపెట్టి, సైలెన్సర్లు తొలగించి బలప్రదర్శన చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించాయని ధ్వజమెత్తారు. రౌడీయిజాన్ని ప్రదర్శించడం వైసీపీ రాజకీయ సంస్కృతిగా మారిందని ఎద్దేవా చేశారు. (బుధవారం) అమరావతి వేదికగా మీడియాతో మంత్రి సుభాశ్ మాట్లాడారు. పొగాకు రైతుల సమస్యలపై మాట్లాడే నైతిక అర్హత జగన్‌కి లేదని చెప్పుకొచ్చారు.వైసీపీ హయాంలో కేవలం 12.9 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు జరిగిందని ప్రస్తావించారు. ప్రస్తుత ప్రభుత్వం 28.9 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు చేసి రైతులకు మద్దతుగా నిలిచిందని




తెలిపారు. పొగాకు కొనుగోళ్ల ద్వారా రైతులకు సుమారు రూ.270 కోట్ల ఆర్థిక ప్రయోజనం తమ కూటమి ప్రభుత్వం కల్పించిందని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల పతనం, యుద్ధ పరిస్థితులు వంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం రైతులకు అండగా ఉందని చెప్పుకొచ్చారు.కిలోకు రూ.10 ప్రోత్సాహక సాయం అందిస్తూ ప్రభుత్వం సుమారు రూ.100 కోట్ల భారం ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. రైతులకు రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలు అందించే అంశంపై కేంద్రంతో చర్చలు జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి పెడు తుంటే, జగన్ మాత్రం బలప్రదర్శనలు, రాజ కీయ ఆరోపణలకే పరిమితమయ్యారని దుయ ్యబట్టారు. ప్రజా సమస్యల కంటే రాజకీయ ప్రచారానికే గొడ్డలి పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి సుభాశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# దేశంలో ఎక్కడా బీసీల కోసం ప్రత్యేక చట్టం లేదు

**అమరావతి, ఆగస్టు 5:** బీసీల కోసం ప్రత్యేక చట్టమంటూ దేశంలో ఎక్కడా లేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఈరోజు(బుధవారం) బీసీ రక్షణ చట్టంలోని వివరాలను మీడియాకు మంత్రి వెల్లడించారు. బీసీల కోసం కొత్తగా తెచ్చే చట్టంపై రెండేళ్ల నుంచి తీవ్ర కసరత్తు చేశామని తెలిపారు. 2019-24 కాలంలో బలహీనవర్గాలపై కక్షకట్టి దమనకాండ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బలహీనవర్గాల కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని మేనిఫెస్టోలో పెట్టామని అన్నారు. సమస్యల పరిష్కారానికి సబ్‌కమిటీ కూడా నియమించామన్నారు. సమాజంలో బలహీనవర్గాలకు ఉన్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు.బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది అన్న ఎన్టీఆర్ అని.. ఆ రిజర్వేషన్లను 27 శాతానికి పెంచింది చంద్రబాబు నాయుడు అని మంత్రి చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో బలహీనవర్గాలు 70 శాతం మంది ఉన్నారని తెలిపారు. ఈ చట్టాన్ని అన్ని విధాల అమలులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తామన్నారు. జిల్లాల వారీగా బలహీనవర్గాల సంఘాలతో మాట్లాడాలని సబ్ కమిటీకి చెప్పామని తెలిపారు. కొత్త చట్టాన్ని ప్రజలకు వివరించి సలహాలు తీసుకోవాలని ఆదేశించామని చెప్పారు. టీడీపీ వెన్నంటే ఉంది బలహీనవర్గాలే అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

# ఆర్టికల్ 370 రద్దుకు ఏడేళ్లు పూర్తి జమ్మూకశ్మీర్‌లో కట్టుదిట్టమైన భద్రత



**జమ్మూకశ్మీర్:** జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దు చేసి బుధవారం(ఆగస్టు 5) నాటికి ఏడేళ్లు అవుతోంది. ఈ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జమ్మూకశ్మీర్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. కేంద్రపాలిత ప్రాంతవ్యాప్తంగా బహుళ అంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. అలాగే సరిహద్దు ప్రాంతాల్లోనూ నిఘాను పెంచారు. జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాలు (సీఆర్‌పీఎఫ్) తనిఖీలు నిర్వహించాయి. రాంబన్ ప్రాంతంలో వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మరోవైపు కుల్గామ్ పోలీసులు ఎన్‌హెచ్-44పై వాహన తనిఖీలు, గుర్తింపు కార్డుల పరిశీలనను ముమ్మరం చేశారు. ఆర్టికల్ 370 రద్దు వార్షికోత్సవం నేపథ్యంలో పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వలేదని అధికారులు తెలిపారు. ప్రజా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా భద్రతా సంస్థలు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నాయి. అభివృద్ధి వేగం పెరిగింది : బీజేపీఆర్టికల్ 370 రద్దు ఏడో వార్షికోత్సవం సందర్భంగా బీజేపీ ఎంపీ గులాం అలీ ఖటానా స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూకశ్మీర్ సమస్యను లోతుగా అర్థం చేసుకుని మూల సమస్యలను పరిష్కరించారని అన్నారు. 370 కారణంగా పోలీసు వ్యవస్థ రాష్ట్ర పరిధిలో ఉండేదని, మహిళలు ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని వివాహం చేసుకుంటే ఆస్తి హక్కుల విషయంలో సమస్యలు ఎదురయ్యేవని పేర్కొన్నారు. ఓబీసీలకు కూడా గతంలో సరైన గుర్తింపు లేదని తెలిపారు. ప్రస్తుతం మతపరమైన పర్యాటకం, సాధారణ పర్యాటకం, జీ20 దేశాల ప్రతినిధుల పర్యటనలు, అంతర్జాతీయ పెట్టుబడులు వంటి అంశాల్లో పురోగతి కనిపిస్తోందని చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 60 శాతానికి పైగా పోలింగ్ నమోదైందని, ప్రజల్లో విశ్వాసం పెరిగిందని వ్యాఖ్యానించారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలి: ఫరూక్ అబ్దుల్లాఆర్టికల్ 370 రద్దు ఏడో వార్షికోత్సవం సందర్భంగా జమ్మూకశ్మీర్‌లో రాష్ట్ర హోదా అంశం మరోసారి రాజకీయ చర్చకు వచ్చింది. జమ్మూకశ్మీర్?కు రాష్ట్ర హోదాను తిరిగి కల్పించాలని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్?సీ)అధినేత ఫరూక్ అబ్దుల్లా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన సమయం వచ్చిందని ఆయన పేర్కొన్నారు జమ్మూకశ్మీర్ ప్రజలకు, దేశానికి ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని అన్నారు. ఆ హామీని అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఎన్?పీ ఎమ్మెల్యే సజ్జాద్ షహీన్ కూడా ఆర్టికల్ 370 రద్దుపై బీజేపీ వాదనలను తప్పుబట్టారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం పూర్తిగా అంతం కాలేదని ఆయన వ్యాఖ్యానించారు. జమ్మూకశ్మీర్ ప్రజల భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. ఆర్టికల్ 370, 35ఏ పునరుద్ధరణ కోసం పోరాటం: మెహబూబామరోవైపు పీపుల్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధినేత్రి మెహబూబా ముఫ్తీ కూడా ఆర్టికల్ 370, 35ఏ పునరుద్ధరణ కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆర్టికల్ 370 రద్దు ఏడో వార్షికోత్సవానికి ముందు శ్రీనగర్‌లో ఆమె కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ప్రత్యేక హోదాను బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం తొలగించిందని ఆరోపిస్తూ. దాన్ని తిరిగి సాధించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఆర్టికల్ 370 కేవలం రాజ్యాంగ నిబంధన కాదని, అది జమ్మూకశ్మీర్ ప్రజల గుర్తింపు, హక్కులకు ప్రతీక అని మెహబూబా పేర్కొన్నారు. తమకు లభించిన హక్కులు భారత రాజ్యాంగం ద్వారా వచ్చినవేనని, ఇతర దేశాల నుంచి కాదని స్పష్టం చేశారు. దేశంలోని వివిధ జైళ్లలో ఉన్న విడుదల కోసం కూడా పోరాడతామని అన్నారు.

# పార్లమెంట్‌లో గందరగోళంపై కేంద్రం సమాలోచనలు.



**న్యూ ఢిల్లీ :** పార్లమెంట్‌లో నెలకొన్న గందరగోళానికి తెరదించేందుకు కేంద్రం ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. ప్రతిపక్షాల నినాదాల మధ్య లోక్‌సభ సమావేశమైన కొద్ది నిమిషాలకే వాయిదా పడిన అనంతరం.. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు భేటీ అయ్యారు. పార్లమెంట్ హౌస్‌లోని రాహుల్ ఛాంబర్‌లో సుమారు 50 నిమిషాల పాటు ఈ సమావేశం సాగింది. రాహుల్‌తో పాటు కాంగ్రెస్ ఎంపీలు ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్, గౌరవ్ గొగోయ్ తదతర ముఖ్యులు పాల్గొన్నారు.ఆ అభ్యర్థనను తిరస్కరించిన రాహుల్‌ఈ భేటీలో వివాదాస్పద డీలిమిటేషన్ బిల్లు, ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేటింగ్ యాక్ట్(ఖీజ=ూ) సవరణ బిల్లుపై ప్రధానంగా చర్చలు జరిగినట్టు సమాచారం. అయితే.. రిజిజు అభ్యర్థనను రాహుల్ పూర్తిగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. అయోధ్య రామ మందిరంలో జరిగిన విరాళాల చోరీ ఆరోపణలపై చర్చ, అలాగే ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనల సందర్భంగా విద్యార్థులపై పోలీసుల చర్యకు సంబంధించి హోం మంత్రి అమిత్ షా ప్రకటన చేసే వరకు సభలో కార్యకలాపాలను అడ్డుకుంటామని రిజిజుతో రాహుల్ చెప్పినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రాహుల్‌తో భేటీ అనంతరం కిరణ్ రిజిజు.. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమావేశం అయ్యారు. ఆ తర్వాత అఖిలేష్ యాదవ్ సహా ఇతర విపక్ష నేతలతోనూ రిజిజు భేటీ అయ్యే అవకాశముంది. సభ సజావుగా సాగేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రధానంగా దృష్టి సారించిన కేంద్రం.. ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తోంది.

# మయన్మార్‌తో సరిహద్దు వివాదం.. పరిష్కారం దిశగా చర్చలు



**మణిపుర్:** మణిపుర్‌లో దశాబ్దాలుగా పెండింగ్‌లో సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకోవడానికి.. భారత్, మయన్మార్ ఓ భూభాగ మార్పిడి ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు సమాచారం. సరిహద్దులో దశాబ్దాలుగా పరిష్కారం కాని ప్రాంతాల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఇరు దేశాల మధ్య భూభాగ మార్పిడి ప్రతిపాదనపై చర్చలు కొనసాగుతున్నాయని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. అయితే.. దీనిపై తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఢిల్లీలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. 'సరిహద్దులో ఇంకా పరిష్కరించని ప్రాంతాలు కొన్ని ఉన్నాయి. వాటి పరిష్కరించే దిశగా చర్చలు కొనసాగుతున్నాయి' అని అన్నారు.ఇటీవల వెలువడిన కథనాల ప్రకారం, మణిపుర్‌లోని చందేల్ జిల్లా, మయన్మార్‌లోని కబావ్ లోయ ప్రాంతం మధ్య సుమారు 1.4 చదరపు మైళ్ల భూభాగ మార్పిడి ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఈ మార్పిడి ద్వారా సరిహద్దు స్తంభాల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి, మిగిలిన సరిహద్దును కంచెతో భద్రపరచాలని యోచిస్తున్నట్టు ఉన్నట్లు సమాచారం.

# అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే అరెస్టు



తమిళనాడులో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది. తంజావూరు నిరసన కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో తనను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై డీఎంకే నేత, తమిళనాడు అసెంబ్లీ ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం తనపై చర్యలు తీసుకోవడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం ఎదుర్కొంటున్న విమర్శల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే తన అరెస్ట్‌ను ఉపయోగించుకుంటోందని విమర్శించారు. తనపై నమోదైన కేసులు, పోలీసులు తీసుకున్న చర్యలు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు.రైతుల ఇబ్బందులను పరిష్కరించలేని ప్రభుత్వం, అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు నన్ను అరెస్ట్ చేసిందని అని ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై తప్పుడు కేసులు నమోదు చేసి చెన్నై, తంజావూరు మధ్య తిప్పుతున్నారని ఆరోపించారు. అరెస్ట్ సమయంలోనే మీడియాతో మాట్లాడి ఈ వ్యవహారాన్ని ఓ నాటకంగా భావిస్తున్నట్లు చెప్పానని తెలి పారు. పోలీసులకు భయపడి ఎక్కడికీ పారి పోలేదని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రిపై తీవ్ర విమర్శలుకరూర్?లో 41 మంది మరణించిన ఘటనను ప్రస్తావిస్తూ సీఎం విజయ్ తీరుపై విమర్శలు చేశారు ఉదయనిధి స్టాలిన్. ఆ ఘటన సమయంలో ముఖ్యమంత్రి భయంతో స్పందించలేదని ఆరోపించారు. బాధిత కుటుంబాలను పరామర్శించకుండా, మీడియాను ఎదుర్కోకుండా వ్యవహరించారని విమర్శించారు. అరెస్ట్?కు ముఖ్యమంత్రి భయపడవచ్చేమో గానీ, తాను కాదని ఉధయనిధి స్టాలిన్ ఉన్నారు. తాను కరుణానిధి మనవడినని, ఎంకే స్టాలిన్ కుమారుడినని గుర్తు చేశారు. రైతుల హక్కుల కోసం పోరాడాల్సి వస్తే ఒక్కసారి కాదు, వందసార్లైనా అరెస్టుకు సిద్ధమేనని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం 300 కిలోమీటర్లు కాదు, అవసరమైతే 3వేల కిలోమీటర్లు కూడా నడవడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ప్రభుత్వ అణచివేత చర్యలు ప్రజాసేవను ఆపలేవని పేర్కొన్నారు. తన అరెస్టును ఖండించిన వివిధ రాజకీయ పార్టీల నాయకులకు, సంఘాలకు, తమిళనాడంతటా మద్దతుగా నిలిచిన డీఎంకే కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్ సమావేశాలకు అడ్డుకట్టే లక్ష్యమా?డీఎంకే సీనియర్ నేత, న్యాయవాది ఎన్.ఆర్. ఎలంగో కూడా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతిపక్ష నేత సభకు హాజరై కీలక అంశాలను లేవనెత్తకుండా అడ్డుకోవడానికే అరెస్టు యత్నం జరిగిందని ఆరోపించారు. ఇదే కేసులో మద్రాస్ హైకోర్టు విచారణ పూర్తయ్యాక ఉదయనిధిని విడుదల చేయాలని పోలీసులను ఆదేశించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

# విద్యార్థుల నిరసనలో పోలీసు చర్యపై అమిత్ షా సమాధానం చెప్పాలి





**న్యూ ఢిల్లీ :** విద్యార్థుల నిరసనపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. జులై 20న జరిగిన విద్యార్థుల ఆందోళనలో లాఠీచార్జ్, పెల్లెట్ గన్స్ వినియోగం జరిగిందన్న ఆరో పణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. ఢిల్లీలోని ప్రేరణా స్థల్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం నుంచి మకర్ ద్వార్ వరకు మార్చ్ నిర్వహించారు. విద్యార్థులపై పోలీసుల చర్యతో పాటు అయోధ్య రామ మందిర విరాళాల నిధుల వ్యవహారం వంటి అంశాలపై కూడా ప్రశ్నించాయి. ప్రియాంక గాంధీ ప్రశ్నలుకాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజాస్వామ్య దేశంలో అధికారంలో ఉన్నవారు తమ నిర్ణయాలను బాధ్యత వహించాలని అన్నారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమని, ఎవరి రాజదర్బార్ కాదని అన్నారు. యువతపై బలప్రయోగానికి ఆదేశాలు ఎవరు ఇచ్చారు? లాఠీచార్జ్, పెల్లెట్ గన్స్, టియర్ గ్యాస్ వినియోగానికి అనుమతి ఇచ్చింది ఎవరు?' అని ఆమె ప్రశ్నించారు. పదవుల్లో ఉన్న వారికి ప్రజల పట్ల బాధ్యత ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులపై కాల్పులు, పెల్లెట్ గన్స్ ప్రయోగం, టియర్ గ్యాస్, లాఠీచార్జ్ వంటి ఘటనలు జరిగితే అందుకు ఆదేశాలు ఇచ్చిన వారు బాధ్యత తీసుకోవాల్సిందేనని అన్నారు. వారు ప్రజల ముందు సమాధానం చెప్పాల్సిందేనని ఆమె పేర్కొన్నారు. పార్లమెంట్‌లోనూ నిరసనలవిపక్షాల నిరసనలతో పార్లమెంట్? ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్ సహా అయోధ్యలో విరాళాల చోరీ అంశంపై చర్చించాలని విపక్షాలు పట్టుపట్టగా లోక్ సభ ప్రారంభమైన కాసేపటికే వాయిదా పడింది. ఈ రెండు అంశాలపై కేంద్రహోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. కొందరు ప్రతిపక్ష ఎంపీలు నిల్చొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని స్పీకర్ కోరగా ప్రతిపక్షాలు వినకపోవడంతో సభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో తొలుత మధ్యాహ్నం 12 గంటలకు సభ వాయిదా పడింది. సభ ప్రారంభం కాగానే మళ్లీ అదే పరిస్థితి నెలకొనడంతో రాజ్యసభ ఛైర్మన్ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు.రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రధాని, హోంమంత్రి సభకు వచ్చి ప్రకటన చేయాలని అన్నారు. చర్చ ద్వారానే పరిష్కారం లభిస్తుందని, అందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సభ ప్రారంభమై చాలా రోజులు గడిచినా ప్రధాని సభకు రాకపోవడం పార్లమెంట్‌ను అవమానించడమే నని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ మాట్లాడుతూ, దేశానికి సంబంధించిన కీలక అంశాలపై ప్రధాని సభలో సమాధానం ఇవ్వాలని విపక్షాలు కోరుతున్నాయని అన్నారు. ప్రధాని, హోంమంత్రి ఇద్దరూ సభకు హాజరుకాకపోవడం విచారకరమని, జాతీయ ప్రాధాన్య అంశాలపై వారి బాధ్యత కనిపించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీ సయ్యద్ నసీర్ హుస్సేన్ మాట్లాడుతూ, జంతర్‌మంతర్‌లో విద్యార్థుల నిరసన సందర్భంగా బలప్రయోగం, పెల్లెట్ గన్స్ వినియోగంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అయోధ్య రామ మందిరానికి వచ్చిన విరాళాల నిధులపై వస్తున్న ఆరోపణలు, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ అంశాలపైనా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.

# షేక్ హసీనా ప్రసంగంతో భారత ప్రభుత్వానికి సంబంధం లేదు



**బంగ్లాదేశ్ :** మాజీ ప్రధాని షేక్ హసీనా వర్చువల్‌గా పాల్గొననున్న కార్యక్రమంపై భారత ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది (). ఆ కార్యక్రమం నిర్వహణలో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి పాత్రా లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూూ) స్పష్టం చేసింది. బుధవారం సాయంత్రం ఢిల్లీ నుంచి హసీనా వర్చువల్‌గా ప్రసంగించనున్నారు. భారత భూభాగం నుంచి షేక్ హసీనా బంగ్లా అంతర్గత రాజకీయాల గురించి మాట్లాడడంపై వివాదం నెలకొంది. హసీనా భారతదేశంలో రాజకీయ ప్రసంగం ఇవ్వడం వల్ల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం పడొచ్చని బంగ్లాదేశ్ ఆందోళన వ్యక్తం చేసింది. పొరుగు దేశం భారత్‌తో ఉన్న స్నేహపూర్వక సంబంధాలు చెడిపోవాలని తాము కోరుకోవడం లేదని బంగ్లా విదేశాంగశాఖ సహాయ మంత్రి షామా ఒబేద్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని భారత్ అర్థం చేసుకుంటుందని ఆశిస్తున్నట్టు తెలిపారు బంగ్లా ఆరోపణలపై భారత్ విదేశాంగ శాఖ స్పందించింది. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా ఒక ప్రైవేట్ మీడియా సంస్థ నిర్వహిస్తోందని తెలిపింది. షేక్ హసీనా ప్రసంగానికి, భారత ప్రభుత్వానికి ఎలాంటి సంబంధమూ లేదని, ఆ వేదికపై వ్యక్తమయ్యే అభిప్రాయాలు ప్రభుత్వ అధికారిక వైఖరిని ప్రతిబింబించవని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు.

# ఇథనాల్ పెట్రోల్‌పై దుష్ప్రచారం.. బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు



**బాంబే:** ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ అంశానికి సంబంధించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న కంటెంట్‌పై బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ఎక్స్, మెటాలలో ఉన్న అభ్యంతరకర కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఇందులో ఏఐ ఆధారంగా క్రియేట్ చేసిన కంటెంట్ కూడా ఉందని పేర్కొంది.సంబంధిత కంటెంట్‌ను ఎవరు సృష్టించారు? ఎవరు అప్‌లోడ్ చేశారు? అనే వివరాలను తమకు అందజేయాలని ఎక్స్, మెటా సంస్థలను బాంబే హైకోర్టు ఆదేశించింది. సోషల్ మీడియా వేదికలపై తప్పుడు సమాచారం, మార్ఫింగ్ చేసిన వీడియోలు, ఏఐ ఆధారిత కంటెంట్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సాంకేతికత అభివృద్ధి సహా ఏఐ బేస్డ్ కంటెంట్ వినియోగం రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో.. వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా చర్యలు చేపట్టాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

# క్షమాపణ చెప్పకపోతే 'సేఫ్ హార్బర్' రక్షణను ఉపసంహరిస్తాం




**న్యూ ఢిల్లీ :** జులై 23నాటి ప్రధాని మోదీ వీడియోను ఫేస్ బుక్ నుంచి తాత్కాలికంగా తొలగించడం ప్రకంపనలు సృష్టిస్తోంది. సమాచార, ప్రసార సాంకేతిక పార్లమెంటరీ స్థాయీసంఘం 'మెటా'పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో మెటా సీఈఓ జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని 3రోజుల అల్టిమేటం జారీచేసింది. లేకుంటే భారత్‌లో పొందుతున్న 'సేఫ్ హార్బర్' రక్షణను రద్దుచేస్తామని హెచ్చరించింది. మెటా, ట్విట్టర్, స్నాప్‌చాట్, గూగుల్, యూట్యూబ్ వంటి ప్రధాన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణపై పార్లమెంటరీ స్థాయీ కమిటీ కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్నారులపై లైంగిక వేధింపులు, మహిళలను కించపరిచడం వంటి కంటెంట్?పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది.'మోదీ వీడియోను తొలగించడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి బుధవారం సమావేశమైన పార్లమెంటు స్థాయీ సంఘం, ప్రధాని మోదీ పోస్ట్ చేసిన వీడియోను తొలగించడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పేర్కొంది. 140కోట్ల మంది భారతీయుల గొంతుకైన ప్రధాని వీడియోను బ్లాక్ చేయడం సాధారణ అంశం కాదని స్పష్టం చేసింది. కేవలం మెటా మాత్రమే కాకుండా గూగుల్, యూ ట్యూబ్, ఎక్స్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ తదితర సామాజికమాధ్య మాలన్నీ భారత లు సాగించాలని సంఘం స్పష్టం చేసింది.ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ కార్య దర్శికి రాసిన లేఖలో, పేపర్ లీక్‌లపై కఠిన చర్యల గురించి ప్రస్తావించినట్లు లోక్‌సభ సచివాలయ డైరెక్టర్ ఒకరు మాట్లాడారు. విద్యార్థులు, జెన్ జీ తరాన్ని ఉద్దేశించి ప్రధాని ప్రసంగించిన వీడియోను ఫేస్‌బుక్ నుంచి ఐదు-ఆరు గంటల పాటు తొలగించడాన్ని చాలా తీవ్రంగా పరిగణించినట్లు పేర్కొన్నారు. గూగుల్ ప్లేస్టోర్?లోని కొన్ని మోసపూరిత ఫ్రాడ్ యాప్స్?పై కఠిన చర్యలు తీసుకోవాలని పార్లమెంటు స్థాయీ సంఘం లేఖలో పేర్కొంది.కాగా, ఫ్రాడ్ యాప్ కేసులో పెట్టుబడిదారులు రూ. 48 లక్షలకు పైగా నష్టపోయినట్లు హైదరాబాద్ సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు దాఖలయ్యాయి. సైబర్ మోసగాళ్లతో పాటు హైదరాబాద్ పోలీసులు గూగుల్ ఇండియా హెడ్‌ను కూడా ఈ కేసులో సహ నిందితుడిగా చేర్చి తదుపరి చర్యలకు సిద్ధం అయ్యారు. అయితే, హైదరాబాద్ పోలీసులు తీసుకున్న చర్య తరహాలోనే, భారత ప్రభుత్వం కూడా గూగుల్ ఇండియాపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా పార్లమెంటరీ కమిటీ తన లేఖలో పేర్కొంది.